పిఆర్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించిన ఆర్డీవో



నవతెలంగాణ-బోధన్

పిఆర్టియు బోధన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్ పిఆర్టియు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజం నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని కావున ఉపాధ్యాయులు నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ ఇంచార్జ్ శంకర్, బోధన్ ప్రధాన కార్యదర్శి ధనరాజ్, అర్బన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, పోతంగల్ అధ్యక్షులు సూదాం వెంకటేష్, రుద్రూర్ ప్రధాన కార్యదర్శి సుధీర్, రాష్ట్ర బాధ్యులు కృష్ణ, సంజీవ్ కుమార్, మండల బాధ్యులు వాసవి, అయూబ్, అబ్యేందర్, సభ్యులు బాలాజీ, శివకుమారి, పీరాజి, గోవర్ధన్, తహశీల్దార్ విట్టల్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ధర్మారెడ్డి తండాకు చెందిన శ్రీకాంత్ (31) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మారెడ్డి తండాకు చెందిన శ్రీకాంత్ ఇంట్లో చిన్న చిన్న తగాదాలు జరిగేవి. అయితే శ్రీకాంత్ అప్పుడప్పుడు పురుగుల మందు తాగినట్లు బెదిరించేవాడు. ఈ క్రమంలో ఈనెల 1న పురుగుల మందు తాగాడు. ఎప్పటిలాగే తాగినట్టు భయపెడుతున్నాడని కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పరిస్థితి విషమించింది. బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ దావకానకు చికిత్స కోసం తరలించగా.. పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మృతిచెందాడు. శ్రీకాంత్ సోదరుడు సర్వన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇటీవలే ప్రేమ వివాహం జరిగింది. కాగా ఆయనకు భార్య దీపిక ఉన్నారు.

నెగ్గిన అవిశ్వాసం

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కోల్పోయిన పండిత్ వినీత.. ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌కు ఊహించని షాక్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత తన పదవిని కోల్పోయారు. నాలుగు సంవత్సరాలుగా చైర్‌పర్సన్‌గా కొనసాగిన వినీతపై స్వపక్షానికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవిని కోల్పోయింది. పట్టణ మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ అవిశ్వాసంలో 25 మంది ఉండడంతో నెగ్గినట్లు ప్రకటించారు. బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు, బిజెపి కౌన్సిలర్లు మొత్తం 24 మంది స్థానిక ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో మెంబర్ మొత్తం 25మంది సభ్యులు ఉండడంతో చైర్‌పర్సన్ పండిత్ వినీతకు ఊహించని షాక్ తగిలింది. అవిశ్వాస తీర్మాన వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు తేదీని ప్రకటిస్తామని అన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 12వ తేదీ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై మున్సిపల్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన గురువారం జరిగిన సమావేశంతో ఉత్కంఠకు తెరపడింది. కాగా చైర్‌పర్సన్ పండిత్ వినీత ఆమె మద్దతుదారులు మున్సిపల్ అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరు కాలేదు. గురువారం జరిగిన మున్సిపల్ అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగదీష్ చందర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్‌బాబు, రూరల్ సిఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు గంగాధర్, అశోక్, గోపి, యాదగిరి గౌడ్ తదితరులు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బలగాల మధ్య గట్టిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



చేతులెత్తిన మున్సిపల్ కౌన్సిలర్లు

అవినీతి పాలనను అంతమొందించాం

ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి పాలనను ప్రజాభిప్రాయం మేరకు అంతమొందించామని, మున్సిపల్‌పై కాషాయ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బిజెపి ఫ్లోర్ లీడర్ జీవి నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మందుల బాలు, జానకంపేట సంతోష్‌రెడ్డి, పెర్కిట్ దుగ్గి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి తోడ్పాటు అందిస్తేనే

అభివృద్ధి ఆవిష్కృతం

- అందుకు అందరూ సహకరించాలి
- ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేస్తాం
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సమాజానికి ఎంతో కొంత తోడ్పాటును అందించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని, ఆ దిశగా ముందుకు సాగినప్పుడే అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన సమాజం ఆవిష్కృతమవుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఉద్బోధించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద రూ.62.77లక్షల ప్రభుత్వ నిధులతో పాటు దాతలు పెద్ద ఎత్తున సమకూర్చిన విరాళాలను వెచ్చిస్తూ అన్ని సదుపాయాలతో అధునాతన హంగులను సమకూరుస్తూ నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన సముదాయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. సరస్వతి మాత విగ్రహానికి పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల నిర్మాణానికి సింహభాగం విరాళాలను అందించి తన దాతృత్వాన్ని చాటుకున్న పైపుల రాజిరెడ్డి, అతని కుటుంబ సభ్యులతో పాటు ఇతర దాతలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దాతృత్వం అంటే ఎలా ఉండాలనడానికి పైపుల రాజిరెడ్డి ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ సొంత ఊరికి, సమాజానికి తోడ్పాటును అందించాలని సూచించారు. ఇతర వాటితో పోలిస్తే సమాజంలో విద్య, వైద్యం ఎంతో కీలకమైనవని, ఈ రెండు రంగాలను పటిష్టపర్చాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇందులో భాగంగానే సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తున్న ఆరోగ్యశ్రీ సేవలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. అదేవిధంగా అందరికి నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందుబాటులోకి తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆయా వర్గాల వారిలో నెలకొని ఉన్న చులకన భావం దూరం కావాలన్నారు. ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ బడుల గురించి తప్పనిసరిగా ఆలోచన చేస్తూ, వాటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అంకితభావంతో కృషి చేయాలని, దీనిని నిరంతర ప్రక్రియగా భావించాలని పిలుపునిచ్చారు. సమాజానికి, ప్రపంచ మానవాళికి ఉపయోగపడే విద్య వైద్య రంగాలను లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో చూడాలని హితవు పలికారు. ఒక వ్యక్తి సంపూర్ణంగా ఎదగాలంటే విద్యతో పాటు మంచి సంస్కారం, సామాజిక బాధ్యతను గుర్తెరిగి మెలగడం ఎంతో అవసరమని అన్నారు. అలాంటప్పుడే ఆలోచనల్లో మార్పు వచ్చి సమాజానికి సాయపడాలనే తపన పెరుగుతుందన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు దాత రాజిరెడ్డి పెద్ద ఎత్తున తోడ్పాటును అందించడం అభినందనీయమని జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలకు సహకారం అందిస్తే ఏ విధమైన అద్భుత ఫలితాలు సిద్ధిస్తాయనడానికి జక్రాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణమే ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, మన మూలాలను మర్చిపోకుండా స్వస్థలానికి తమ శక్తి మేరకు సహకారం అందించాలని సూచించారు. దాతలు అందించిన తోడ్పాటుతో అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అందరికీ ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వ పాఠశాలలను నిర్మించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. కాగా, డిచ్‌పల్లిలో మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని, ఇందల్వాయిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. అంతకుముందు జక్రాన్‌పల్లి శివారులోని దేవునితండాలో గల శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, వినోద్ కుమార్, డీఈఓ దుర్గాప్రసాద్, ఎంపిపి విమల, జెడ్పిటీసీ తనూజరెడ్డి, సర్పంచ్ చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పోచారం ప్రాజెక్టు నుండి విడుదల చేసిన నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ అన్నారు. గురువారం మండలంలోని పోచారం ప్రాజెక్టు ద్వారా ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పోచారం ప్రాజెక్టు చాలా అందమైన ప్రాజెక్టు అని ఆయన అన్నారు. పోచారం ప్రాజెక్టు ద్వారా నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి రెండు మండలాలకు నీరందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాసంగి పంటలకు పోచారం ప్రాజెక్టు ద్వారా నీరు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోచారం ప్రాజెక్టు ద్వారానే విడుదల చేసిన నీరు ఏప్రిల్ నెల వరకు కొనసాగుతుందని 15 రోజులు నీటి విడుదల పది రోజులు నీటి ఆపుదల జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు నీటిని వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పోచారం సర్పంచ్ విజిత రెడ్డి, ఎంపీపీ రాజుదాస్, జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్సీ విద్యావతి, ఈఈ మల్లేష్, డి.వెంకటేశ్వర్లు, నాయకులు రామచంద్రారెడ్డి, విట్టల్‌రెడ్డి, బోయిన విట్టల్, నరసింహారెడ్డి, శ్రీధర్‌గౌడ్, పర్వతరావు, వాసురెడ్డి, లక్ష్మణ్, ఇమామ్, సాయికుమార్, బోయిని హనుమాన్లు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర స్థానిక సంస్థల ఫోరం ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావును లింగంపేట్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర స్థానిక సంస్థల ఫోరం ఉపాధ్యక్షులు ఏలేటి సంతోష్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసగంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండలంలో పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. లింగంపేట్ మండల ప్రధాన సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేద్దామన్నారు. కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టినటువంటి ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలయ్యే దిశగా పని చేద్దామన్నారు. ఇప్పటికే ప్రజాపాలన గ్రామాల్లో అర్హులైనటువంటి లబ్ధిదారులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారని రాష్ట్ర స్థానిక సంస్థల ఫోరం ఉపాధ్యక్షులు ఏలేటి సంతోష్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎప్పటికప్పుడు ప్రజలు లబ్ధిదారుల అవసరాల నిమిత్తం దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అంతే కాకుండా పర్యవేక్షించాలని ఆయన సూచించారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంతోష్‌రెడ్డి

ప్రజాపాలన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని ముత్యంపేట గ్రామంలో ప్రజాపాలన కాంగ్రెస్ అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా జడ్పిటిసి తీగల తిరుమలగౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావు ఆధ్వర్యంలో దరఖా స్తుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి రసీదులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారెంటీలు అమలును అర్హులైన పేదలకు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను స్వీకరి స్తున్నామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6వ తేదీ వరకు గ్రామాలలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంజయ్‌రావు, విండో చైర్మన్ తిరుపతిగౌడ్, పంచాయతీ సెక్రటరీ రాహుల్, ఆశావర్కర్స్, సీఏలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

కామారెడ్డిలో ఒక్కరోజే 35,991 దరఖాస్తులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో గురువారం 153 గ్రామ మున్సిపల్ వార్డులలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి, 35,991 దరఖాస్తులతో పాటు మరో 1760 ఇతర దరఖాస్తులు స్వీకరించినట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కాగా ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా పాలనలో 489 గ్రామ వార్డు సభలు నిర్వహించి 2,28,516 దరఖాస్తులతో పాటు మరో ఇతర సమస్యలకు సంబంధించి 8818 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు.

కండ్లు లేవని అధైర్యపడొద్దు

- విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ.. మహనీయుడు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

అంధుల కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి విజ్ఞాన జ్యోతిని వెలిగించిన మహనీయుడు, విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంధుల దినోత్సవ వేడుకలలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇష్టపడి చదివి సమాజంలో మంచి గుర్తింపును పొందాలని అన్నారు. అంధులు ఆత్మవిశ్వాసంతో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని అభిలషించారు. కండ్లు లేవని అంధులు అధైర్యపడవద్దని బ్రెయిలీ లిపి ద్వారా చదువు నేర్చుకొని ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలన్నారు. ప్రజా పాలన దరఖాస్తులను అధికారులు దివ్యాంగుల ఇంటివద్దకు వెళ్లి తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దివ్యాంగులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఇంకా కావలసిన సౌకర్యాలను కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అంధుల కోసం ఎలక్షన్ కమిషన్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై బ్రెయిలీ లిపిని రాయించినట్లు తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లూయిస్ బ్రెయిలీ జన్మదిన శుభాకాంక్షలను అంధులకు తెలిపారు. ఈ సందర్భంగా బ్రెయిలీ లిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య మాట్లాడుతూ.. అంధులు పట్టుదలతో ఇష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలని తెలిపారు. దివ్యాంగులు భవిత కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, జాతీయ అంధుల సంఘం అధ్యక్షుడు హరిసింగ్, భవిత కోఆర్డినేటర్ శ్రీపతి, సుదర ఫౌండేషన్ ప్రతినిధి సుజాతరెడ్డి, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పోశవ్వ, బిక్ష నాయక్, రవీందర్, చిప్ప దుర్గాప్రసాద్, ఐసిడిఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పెద్దదిక్కు కోల్పోయి.. రోడ్డున పడ్డ కుటుంబం

- ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-బోధన్

ఓ కుటుంబం ఇంటి పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడింది. తమను ఆదుకోవాలని ఆ బాధిత కుటుంబం వేడుకుంటోంది. బాధితుల వివరాల ప్రకారం.. బోధన్ మండలం పెంటఖుర్దు గ్రామానికి చెందిన జాగారం ప్రకాశ్ (23) అనే యువకుడు ఉపాధి కోసం నగరానికి వెళ్లాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవడానికి వస్తుండగా డిసెంబర్ 29న శుక్రవారం రాత్రి మెదక్ జిల్లా రామయంపేట్ వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. నిరుపేద దళిత కుటుంబం కావడంతో కుటుంబాన్ని పోషించే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తమను ఆదుకోవాలంటూ మృతుని కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిరుపేద దళిత కుటుంబమైన తమకు ఎలాంటి ఆధారం లేక ఉపాధి కోసం వలస వెళ్లిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని భార్య కావ్యశ్రీ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. గ్రామంలో ఏ ఉపాధి లేక రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కూలీ పని చేసుకుంటూ తమ కుటుంబం గడుస్తుందని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు 3సంవత్సరాల కూతురు సహస్ర ఉందని కావ్యశ్రీ తెలిపారు. ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.





ఆధారం కోల్పోయిన మృతుని భార్య, కూతురు.. మృతుడు ప్రకాష్ (ఫైల్)

తెలంగాణ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-వర్ని

వర్ని ఉమ్మడి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మోడల్ స్కూల్, కాలేజ్‌లో దాదాపు 800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఆ విద్యార్థులకు ఉదయం సాయంత్రం బస్సు సౌకర్యం లేక కాలినడకన స్కూల్‌కు వెళ్లవలసి వస్తుందని, వెంటనే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. గురువారం వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వర్ని ఏరియా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వర్ని జూనియర్ కళాశాలల అధ్యక్షురాలు సీత మాట్లాడుతూ.. విద్యార్థినీలకు రోడ్డుపైన ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్న, జైన, సరోజ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మామ్ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని షర్బతికేనల్ ఏరియాలో గల మామ్ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఫిజియోథెరపీ వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా మామ్ హెల్త్ సెంటర్ జోనల్ మేనేజర్ రజియా బేగం మాట్లాడుతూ.. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఆరోగ్యాన్ని విస్మరించి రోజువారి పనులలో బిజీగా మారారని అన్నారు. నేటి జీవనంలో రోజువారి పనులతో పాటు ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఆరోగ్యాన్ని విస్మరించడంతో చాలామంది ఎన్నో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. బోధన్‌లో మొట్టమొదటిసారిగా ఫిజియోథెరపీ చికిత్సలను అందిస్తున్నామని, సౌత్ కొరియా దేశానికి చెందిన అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం 1.30 లక్షల రూపాయల విలువ గల ఫిజియోథెరపీ మ్యాట్‌ను కేవలం 13 వేల రూపాయలకు అందిస్తున్నామని ఆమె తెలిపారు. పదిమంది గల కుటుంబ సభ్యులకు ఈ మ్యాట్ జీవితాంతం ఉపయోగపడుతుందని అన్నారు. ఆరోగ్యానికంటే నేటి కాలంలో ఏది విలువైనది కాదని ముందు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. బ్లడ్ థెరపీ, షుగర్, థైరాయిడ్, బాడీపెయిన్స్, పైల్స్, అర్షమొలలకు వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. కావున బోధన్ సమీప ప్రాంతాల ప్రజలు ఈ ఫిజియోథెరపీ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మామ్ ఫిజియోథెరపీ సెంటర్‌ను బోధన్ ఎసిపి కిరణ్ కుమార్ సందర్శించి ఫిజియోథెరపీ చికిత్స పొందారు. అనంతరం ఫిజియోథెరపీ చికిత్సల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ప్రజాపాలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. తహసీల్దార్ హిమబిందు, ఎంపిడిఓ లక్ష్మీ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని ఉత్నూర్, వజ్జపల్లి తండా, సజ్జనాయక్ తండా, పూర్యానాయక్ తండాలో ప్రజాపాలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎం.పి.టి.సిలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి బాధితుడికి గురువారం అందజేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన ఆర్ బాలయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా, సిఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి గురువారం బాధితుడికి అందజేశారు.

ఏ పథకం లబ్ది కావాలో అది పూరించేలా చూడాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజాపాలనలో ప్రజలు అందిస్తున్న దరఖాస్తులను పరిశీలించి ఏ పథకం లబ్ది కావాలో అది పూరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కామారెడ్డి మునిసిపాలిటీ 13వ వార్డులోని టేక్రియల్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా దరఖాస్తులు అందజేయడంతో పాటు వాటిని సరిగ్గా పూరించేలా అవగాహన కలిగించాలని అన్నారు. ప్రజలు ఎక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లలోని సిబ్బంది సహకారంతో ధరఖాస్తులు నింపి రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతపరచి సమర్పించాలన్నారు. గ్రామా సభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమపద్ధతిలో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్ లైన్‌లో డేటా ఎంట్రీ చేయాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేసుకొని నిర్ధారిత సమయంలోగా డేటా నమోదు చేయాలని సూచించారు.

ఏపీ సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గురువారం ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినీ మర్యాద పూర్వకంగా కలిశారు. బి ఆర్ ఎస్ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేయించు కున్నారు కాగా పరామర్శించేం దుకు సీఎం జగన్ వచ్చారు. ఈసందర్భంగా వైఎస్ జగన్‌కు పలువురు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా వాసి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ లింబాద్రి కూతురు వివాహ వేడుకల్లో ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబ సమేతంగా పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. గురువారం హైదరాబాద్‌లోని ఫంక్షన్ హాల్ లో వివాహ వేడుక నిర్వహించారు. ప్రొఫెసర్, చైర్మన్ లింబాద్రి తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్లు, స్నేహితులు, తదితరులు వివాహానికి హాజరయ్యారు.

హాస్టల్స్‌లోని మెస్ బిల్లులను విడుదల చేయాలి

- ఏవోకు ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న వెల్ఫేర్ హాస్టల్స్‌లోని మెస్ బిల్లులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్‌లోని ఏవోకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 5485 కోట్ల మెస్ బిల్లుల బకాయిలను విడుదల చేయాలని కలెక్టర్ ఏవో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఐదు నెలలుగా మెస్ బిల్లులు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్స్‌లో సుమారుగా 50 కోట్లనుండి 70 కోట్ల వరకు జిల్లా వ్యాప్తంగా బకాయిలు ఉన్నాయని, వీటిని విడుదల చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల కాకపోవడంతో ప్రభుత్వ హాస్టల్లోని వార్డెన్‌లపై భారం పడుతుందని ఆయన అన్నారు. బిల్లులు విడుదల కాకపోతే విద్యార్థులకు సరిగ్గా పౌష్టిక ఆహారం అందదని అన్నారు. గత ప్రభుత్వం ట్రెజరర్ వ్యవస్థను తొలగించి ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్ తీసుకురావడంతో మెస్ బిల్లులు సకాలంలో విడుదల కావడం లేదని తెలిపారు. ఐఎఫ్ఎంఎస్ సిస్టంని రద్దుచేసి ట్రెజరీ వ్యవస్థను రూపొందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, ఎస్సై నగర అధ్యక్ష కార్యదర్శులు విశాల్, మహేష్, నాయకులు శైలజ, బాపూరావు, సాజన్ తదితర నాయకులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



సీఎం జగన్‌కు స్వాగతం పలికిన వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించడానికి హైదరాబాద్ విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ మేరకు గురువారం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రశాంత్ రెడ్డి, పల్లె రాజేశ్వర్ రెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌తో కలిసి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి కేసీఆర్ ఇంటికి బయలుదేరి వెళ్లారు.

దేశ భవిష్యత్తును తరగతి గది నిర్ణయిస్తుంది

- జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్



పైపుల రాజారెడ్డిని సన్మానిస్తున్న డీఈవో, ఎస్టీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశ భవిష్యత్తు తరగతి గది నిర్ణయిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం విద్యాదార్శనికులు, గడ్డం(పైపుల) రాజా రెడ్డి ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లి విద్యా చరిత్రలోనే అతి విశిష్టసేవగా గుర్తుండి పోయేలా దాదాపు రెండుకోట్ల రూపాయలతో పాఠశాల భవనాన్ని కట్టించి ప్రజలకు అంకితం చేశారన్నారు. ఈ సందర్భంగా స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌తో కలిసి సన్మానం చేశారు. వారి కృషి అభినందనీయం అని దేశ భవిష్యత్ తరగతి గదిలో నిర్మితమవుతుందని, భావి తరాల కోసం విద్యాలయం నిర్మించడం వారి ముందు చూపుకి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ వనిత, ఎంఈఓ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు దర్మెందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్,జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, పిఆర్‌టియు అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్ ప్రధానోపాధ్యాయులు లింగయ్య మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ అభియాన్



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. రక్తహీనత రాకుండా మంచి పోషకాహారం తీసుకోవాలని, నార్మల్ డెలివరీ అయినట్లయితే, ముందు ముందు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని ఏసీడీపీఓ జ్యోతి తెలిపారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతంతో పాటు మంచి పోషకాహారం ఇవ్వాలని అన్నారు. నిజామాబాద్‌లోని న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ సెంటర్‌కు పిల్లలని తీసుకెళ్తే ఆరోగ్యం, పిల్లలకి పోషకాహారం ఇవ్వడంగురించి తెలియజేస్తారని చెప్పారు. అంగన్వాడిలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడి టీచర్ లక్ష్మి చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో ప్రాథమిక స్థాయి సముదాయ సమావేశం



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆంద్రయ్య అధ్యక్షతన ప్రాథమిక స్థాయి సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రాథమిక స్థాయి పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి పాఠశాల నుండి సగం ఉపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో వారి వారి పాఠశాలలో ఎఫ్ఎల్ నిర్వహణ పద్ధతులను, లైబ్రరీ నిర్వహణ గురించి తెలియజేశారు. ప్రాథమిక స్థాయి సముదాయ సమావేశాన్ని మండల నోడల్ ఆఫీసర్ గంగాధర్, డిస్టిక్ సిపిటి వెంకటేశ్వర్లు, కిషన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని సందర్శించిన కిషన్ గణిత బోధన పద్ధతులు సంబంధించి వివరించగా, వెంకటేశ్వర్లు ఇంగ్లీష్ బోధన పద్ధతులను తెలియజేశారు. సమావేశంలో కాంప్లెక్స్ సెక్రెటరీ నరేందర్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మమ్మురంగా ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని సొసైటీ, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను గురువారం భీంగల్ ఏడీఏ కంపాటి మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణదారులు రైతులకు ఎరువులు అమ్మకాలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదును ఇవ్వాలని తెలిపారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైనంత మేర ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, ఎరువుల నిల్వల నివేదికను ప్రతిరోజు సమర్పించాలని తెలిపారు. యాసంగి సీజన్ లో ఎక్కడా కూడా ఎరువుల కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేద్దామని, అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ కార్యక్రమం గురువారం నగరంలోని వర్ని చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధన్‌పాల్ హాజరై మాట్లాడారు. స్వతంత్ర సమరయోధులు బిర్స ముండా జయంతి నవంబర్ 15 న ఆదివాసి గౌరవ దివస్ సందర్భంగా మన దేశ ప్రధాని వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రజలకు అనుగుణంగా పని చేస్తూ పథకాలను ప్రవేశ పెడ్తుందని తెలిపారు ఈ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినయోగం చేసుకోవాలని కోరారు. వికసిత్ భారత్ వాహనం మన ముందుకే వచ్చిందని అన్నారు ముద్ర యోజన, ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ సిలెండర్లను అందజేస్తుందన్నారు. కరోనా సమయంలో కూడా నగరంలో ఎంతో మంది స్ట్రీట్ వెండర్స్ ఉపయోగించుకున్నారని తెలిపారు. భేటీ బచావో భేటీ పడావోతో పుట్టిన ప్రతి బిడ్డ కు న్యాయం జరుగుతుంది అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రపంచంలో అత్యంత భారీ ఆరోగ్య పథకం అని అన్నారు. ఇది ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, సురక్ష యోజన, జనధన్ యోజన, ఆవాస్ యోజన కొత్త ఇల్లు సహకారం ద్వారా ఇలా ప్రతిదీ పేదల కోసమే మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. పీఎం విశ్వ కర్మ పథకాన్ని 13 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తుందని, ఈ పథకం కింద 18 సంప్రదాయ చేతి వృతల వారికి చేయూత లభిస్తుందని తెలిపారు. దీంతో పాటు శిక్షణ భృతి సహిత నైపుణ్య శిక్షణ సహా 15 వేల విలువైన పరికరాలు కూడా అందిస్తారని అన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా ఆహారధాన్యాల పంపిణీ కార్యక్రమం ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డు విధానం ద్వారా దేశమంతా నిరంతరాయంగా రేషన్ అందుబాటులో ఉంటుందని, స్కిల్ ఇండియా ద్వారా పీఎం కౌశల్ వికాస్ యోజన యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ లభిస్తుందని, పిఎం జన ఔషధ కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పథకాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమం ఫీల్డ్ ఆఫీసర్ ధర్మ నాయక్,లీడ్ బ్యాంకు మేనేజర్ నాగ శ్రీనివాస్, ఎస్ వై కె కోర్డినేటర్ శైలి బెల్లాల్, కార్పొరేటర్లు వెల్డింగ్ నారాయణ, మమత ప్రభాకర్, నాగోళ్ళ లక్ష్మి నారాయణ, ఎడ్ల బాలకిషన్, చిలుక కిషన్,పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సత్యశోధక్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు సత్కారం

నవతెలంగాణ-సిరికొండ

ఇటీవల స్కౌట్స్, గైడ్స్‌లో ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మకమైన రాజ్యపురస్కార్ (గవర్నర్) అవార్డు పొందిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి సత్కరించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఈకార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ విద్యార్థులు పి. యశ్వంత్, డి. నీరజ్ రాథోడ్‌లకు గవర్నర్ ద్వారా వచ్చిన ప్రశంసాపత్రాలను, ప్రత్యేక జ్ఞాపికలను అందించారు. విద్యార్థులు స్కౌట్స్, గైడ్స్‌లో రాణించి రాజ్యపురస్కార్ (గవర్నర్) అవార్డు పొందడం అభినందనీయమని అన్నారు. స్కౌట్స్, గైడ్స్ వల్ల విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ, సేవభావం అలవడుతుందని, విద్యార్థి దశలో స్కౌట్స్, గైడ్స్ , ఎన్‌సీసీలో చేరాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేస్తే అత్యుత్తమ స్థాయిలో స్థిరపడవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్న పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, గంగారెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన

- నోడల్ అధికారి రాములు నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని నోడల్ అధికారి రాములు నాయక్, డిచ్‌పల్లి ఎంపిడిఓ, టీం లీడర్లు టీవీఎస్ గోపి బాబు, తహసిల్దార్లు రాజేందర్, వెంకట్రావు, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందల్‌వాయి మండలం అన్సన్ పల్లి, యెల్లారెడ్డిపల్లి, చంద్రయాన్‌పల్లి, డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి తండా, యానంపల్లి తండా, కొరట్‌పల్లి తండా గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన అభయహస్తం గ్రామ సభలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీ వరకు గ్రామసభలు కొనసాగుతాయని, ప్రజలు దరఖాస్తులను అందజేయాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబం లబ్ది పొందాలని, ఈ నెల 6వరకు దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అరు గ్యారంటీ పథకాలను అమలు చేయడానికి ప్రజల నుండి దరఖాస్తులను పూర్తి చేసి అదికారులకు అందజేయాలని అన్నారు. కార్యక్రమం లో సర్పంచులు బండ గంగవ్వ బోజన్న,నరేష్, లలిత దాస్, తెలు గణేష్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు తాటిపాముల సత్తెవ్వ, తాటిపాముల శ్రీనివాస్ గుప్తా, బాబు రావు, ఉప సర్పంచులు సుగ్గెం రాజేశ్వర్, ప్రకాష్, కార్యదర్శి అశ్వంత్,ఎంపిఓ రాజ్ కాంత్ రావు, పి ఆర్ ఎఈ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ చందన, ఎపిఓ పోశెట్టి, ఎపిఎం సువర్ణ, అర్ఐ నరేష్,, ఏఈవోలు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి రాములు నాయక్

నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్షులు అనీస్, ప్రధాన కార్యదర్శి నవీ న్ కుమార్ అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యం లో కోటగల్లి ఎన్. ఆర్. భవన్, నిజామాబాద్ నగరంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పథకానికి రేషన్ కార్డు జత చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి ముందుగా అర్హత కలిగినవారికి వెంటనే రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యోగాలు వేయాల్సిందిగా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంకోసం యువతీ యువకులు, నిరుద్యోగు లు తమ ప్రాణాలను తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని తెలిపారు. అయినా ఇప్పటివరకు చాలామందిపై కేసులు ఉండటం దుర్మార్గమన్నారు. వెంటనే ఉద్యమ కారులపై, నిరుద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, సహాయ కార్యదర్శి బట్టు రవి, జిల్లా నాయకులు ఉప్పలపల్లి డి. గంగాధర్,మహేష్, మనోజ్ రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ విరాళంగా అందజేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధి గిరీష్ రావు ప్యూరిఫైడ్ వాటర్ మిషన్‌కు పూజా కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీనివిలువ సుమారు రూ. లక్ష 15 వేలు ఉంటుందని గిరీష్ రావు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న సదుద్దేశంతో ఈ ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ అందించినట్లు తెలిపారు. పాఠశాల, గ్రామస్తుల తరఫున ఉప సర్పంచ్ టేకుల జలంధర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, విండో డైరెక్టర్ చిన్నారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధి గిరీష్ రావు

నూతన డిపో మేనేజర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

టీఎస్ ఆర్‌టిసి నూతన డిపో మేనేజర్‌గా వచ్చిన ఆంజనేయులు ను ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రవి చందర్ ఆధ్వర్యంలో గురువారం శాలువా, మెమోంట్ తో సన్మానించారు. కార్యక్రమంలో గోపి నర్సయ్య, జనార్దన్, రాములు, గంగవ్వ, లక్ష్మి త్రివేణి ,జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కోకన్వీనర్‌గా అర్బన్ ఎమ్మెల్యే



నవతెలంగాణ- నిజామాబాద్ సిటీ

అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ కమిటీ తెలంగాణ కో కన్వీనర్‌గా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ను నియమించినట్లు ఆయన గురువారం తెలిపారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున అయోధ్యకు తరలించేందుకు అయన తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు పోరాడుదాం

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆదర్శ విప్లవస్ఫూర్తి సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకై అందరూ కలిసి కట్టుగా ఉంటు పోరాడాలని నిజామాబాద్ జిల్లా పి.డి.ఎస్.యు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు గురువారం డిచ్‌పల్లి బాలుర కళాశాల వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది కాలంలోనే కుల, మత బేధాలు లేకుండా ప్రతి మహిళకు చదువు నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఎన్నో అవధోరాలు వచ్చిన, అవమానాలు చేసినా ప్రతి మహిళకు చదువు నేర్పించాలనే లక్ష్యాన్ని మనోధైర్యంతో ముందుకు వెళ్లి చదువు నేర్పిన చదువుల తల్లి అని అన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేని తరుణంలోనే సొంతగా మహిళల కోసం దేశవ్యాప్తంగా పాఠశాలలు నిర్మించిన మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో టెక్నాలజీ పెరుగుతున్నా విద్యార్థులకు కావలసిన నైపుణ్యతలో, ఎదగడంలోనూ ఇప్పుడున్న ప్రభుత్వాలు కూడా యువతకు ఎటువంటి దారి చూపకపోవడం సిగ్గుచేటన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధనలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పోరేట్ విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా విద్యార్థులు, యువత సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సుందర్ సింగ్, బబ్లు, శివ, రాజేశ్వర్, సాకేత్, అనిల్, నిఖిల్, రంజిత్, శ్రీరామ్, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | జనవరి 05, 2024 | www.navatelangana.com

ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన



నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉద్యోగులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న మాట్లాడుతూ.. ఎయిడ్స్ అనేది అసహజ లైంగిక చర్యల వల్ల, శుభ్రపరచని సిరంజీల వలన, కలుషిత రక్తం వలన ఎయిడ్స్ వ్యాపిస్తుందని, ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. ప్రభుత్వం ఎయిడ్స్ నియంత్రణ కోసం ఎన్నో చర్యలు చేపట్టిందని, జీవితకాలం పెరుగుదలకు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ సభ్యులు సావిత్రి, సంపూర్ణ సురక్ష కేంద్రం స్రవంతి, జనం పాట దప్పు సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పిఆర్‌టియు క్యాలెండర్లను ఎంపీపీ రజనీకిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్, స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో పిఆర్‌టియు క్యాలెండర్లను ఆవిష్కరించినట్టు పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కార్యదర్శి సాయిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, మండల విద్యాశాఖ అధికారి రామారావు, నోడల్ అధికారి ఆంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు శంకర్, రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి రాజేందర్ సింగ్, ఉపాధ్యాయులు అబ్బయ్య, తాహెర్, కిషోర్, చెన్నప్ప, గోవర్ధన్, గంగాధర్ రేమాన్, తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్: దరఖాస్తుల స్వీకరణ



రెంజల్: ప్రజాపాలన కౌంటర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో



పిట్లంలో...



జుక్కల్‌లో...

ప్రజాపాలనకు అపూర్వ స్పందన

- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

ప్రజాపాలనకు అపూర్వ స్పందన లభిస్తోంది. అభయహస్తంలో భాగంగా పలు గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కాగా ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రజలు పెద్దఎత్తున అభయహస్తం పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు.

లచ్చన్ గ్రామంలో ప్రజా పాలన సదస్సు..

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన సదస్సులో భాగంగా గురువారం మండలంలోని లచ్చన్ గ్రామంలో ప్రజా పాలన సదస్సు ఆ గ్రామ సర్పంచ్ గంగాబాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రజా పాలన కార్యక్రమంలో సర్పంచ్ గంగాబాయి, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ గ్రామ ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాపాలన సదస్సులు ప్రజల కోసమే ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ 6 గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ గ్రామ ఎంపీటీసీ, గ్రామపెద్దలు మనోహర్ దేశాయ్, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలన కౌంటర్ల పరిశీలన

రెంజల్: మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కౌంటర్లను ఎంపీడీవో శంకర్, సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా సంయమనంతో ప్రజల దరఖాస్తులను పూర్తి చేయాలని వారు సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తు ఫారాలు కావలసినవారు కౌంటర్ల ముందు తమ పేరు నమోదు చేసుకుని తీసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారంపై ఎలాంటి కొట్టివేతలు, దిద్దుడు లేకుండా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

ప్రజాపాలన కార్యక్రమానికి అపూర్వస్పందన

పిట్లం: ప్రజాపాలన కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కంబాపూర్, బుర్నాపూర్, మార్దండ గ్రామాలలో ప్రజాపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ప్రజాపాలన 6 గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోగా దరఖాస్తులను స్వీకరించారు. కాగా కంబాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీ పథకాలకు 380 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమలలో సర్పంచ్‌లు కవితా పటేల్, ప్రవీణ, ఎంపీట బ్రహ్మం, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎఫ్ఆర్‌సి చైర్మన్ వీర్ సంగప్ప దేశాయ్, ఉపసర్పంచులు, సెక్రటరీలు తుకారం, నారాగౌడ్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో దరఖాస్తుల స్వీకరణ

జుక్కల్: మండలంలోని పలు గ్రామాలలో ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణలో పారదర్శకంగా నిర్వహించాలని నోడల్ అధికారులు గంగాప్రసాద్, యాదగిరి పలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తుల స్వీకరణను, సదుపాయాలను సోపూర్, మధురాతాండా, లొంగన్, మైబాపూర్‌లో పరిశీలించారు. దరఖాస్తు ఫారాలు తక్కువ పడకుండా అందరికి అందేవిధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు సంజీవ్ చౌహన్, అనుషాబాయి శివాజీపటేల్, సంజీవ్ జాదవ్, ఎన్.ఉషారాణీ తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట, పోసానిపేటతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం కొనసాగింది. కార్యక్రమంలో మద్దికుంటలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి, పోసానిపేటలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ నాయకులు నారెడ్డి రాజిరెడ్డి, వీవోలు లత, సంధ్య, స్వప్న, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

మూడు గ్రామాల్లో 1143 దరఖాస్తులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలో జరుగుతున్న ప్రజాపాలన సదస్సులో భాగంగా గురువారం డోంగ్లి మండలంలోని కుర్లా, మద్నూర్ మండలంలోని అంతాపూర్, లచ్చన్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మూడు గ్రామాల్లో కలిసి మొత్తం 1143 దరఖాస్తులు వచ్చినట్లు మండల అభివృద్ధి అధికారి రవిశ్వర్ గౌడ్ తెలిపారు. గ్రామాల వారిగా దరఖాస్తుల స్వీకరణ వివరాలు ఇలా ఉన్నాయి. కుర్లా గ్రామంలో 329, అత్తాపూర్ గ్రామంలో 263, లచ్చన్ గ్రామంలో 551 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో వివరించారు.

బాధితురాలికి రెడ్‌క్రాస్ సొసైటీ చేయూత



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి పెంకుటిల్లు ఇటీవల ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమై సర్వస్వం కోల్పోయినందుకుగానూ మండల రెడ్‌క్రాస్ సొసైటీ తరపున స్టేట్ కమిటీ మెంబర్ సంజీవరెడ్డి పదివేల రూపాయల ఆర్థిక సహాయం, వంట సామాగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథలకు, ఆపత్కాలంలో ఉన్న ప్రజలకు, నిరుపేద సామాన్య పేదలకు సేవలు అందించడంలో రెడ్ క్రాస్ సొసైటీ ముందు వరుసలో ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు బుడాల నవీన్, వైస్ చైర్మన్ బొడ్ల రాజు, బాన్సువాడ డివిజనల్ చైర్మన్ మరగల వేణుగోపాల్, స్థానిక పెద్దలు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చింతల సాయిరెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సలాబత్పూర్ ఆలయ హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.1,80,360



ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ అటు మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులోని మద్నూర్ మండలం సలాబత్పూర్ గ్రామ ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. హుండీ ఆదాయం రూ.1,80,360 వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, క్లర్క్ వేణు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, పూజారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును కలిసిన కొడిచర సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావును మండలంలోని కొడిచర గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్ గురువారం హైదరాబాద్ సెక్రటేరియట్ వద్ద కలిశారు. కొడిచర సర్పంచ్ పలు విషయాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. పార్టీకి కట్టుబడి ఎమ్మెల్యే గెలుపు కోసం కృషిచేసిన సర్పంచ్‌కు ఎమ్మెల్యే వద్ద ఆయనకు ప్రత్యేకంగా గుర్తింపు ఉన్నందున ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మద్నూర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కుమ్మరి సచిన్, మేనూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.



ఎమ్మెల్యేను కలిసిన సర్పంచ్ సంతోష్ పటేల్

అపోహలు నమ్మవద్దు

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి
- ఎంపీడీవో శంకర్



నవతెలంగాణ-రెంజల్

ప్రజలు అపోహలను సృష్టించి ప్రభుత్వ పథకాలపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమాలను దృష్టిలో పెట్టుకుని సీఎం 6 గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టగా, కొందరు కావాలని దరఖాస్తు ఫారాలు ఇవ్వడం లేదని ఆరోపించడం శోచనీయమన్నారు. ఈనెల 28 నుంచి 3 వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రజలందరికీ అవగాహన కల్పించి దరఖాస్తులు పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలో 10,643 కుటుంబాలకు, 113 కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించినట్టు ఆయన తెలిపారు. కొంతమంది దరఖాస్తులు ఇవ్వడం లేదని, మరి కొంతమంది పథకాలు వస్తాయో లేదోనని ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈనెల 17లోపు మండలానికి సంబంధించిన దరఖాస్తులన్నింటిని ఆన్లైన్లో నమోదు చేస్తామని, ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.

శభాష్.. జుక్కల్ పోలీస్



గుంతను పూడ్చుతున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ పోలీసులను ఆ మండల ప్రజలు శభాష్ అని పొగుడుతున్నారు. మండలంలో జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సత్యనారాయణ సమస్య కనిపిస్తే చాలు తన సమస్యగా తీసుకుని దానికి పరిష్కరించేందుకు చూస్తారు.

అందులో భాగంగానే మండలంలోని మాదాపూర్ గ్రామ పీఆర్ రోడ్డును కొన్నేండ్ల క్రితం వేశారు. ప్రస్తుతం రోడు పరిస్థితి అక్కడక్కడా అధ్వానంగా ఉంది. అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు ఇదేదారీ గుండా ప్రయాణిస్తుంటారు. మాదాపూర్ గ్రామం వద్ద లోలేవల్ కల్వర్టు ఎప్పుడో నిర్మించారు. వర్షం నీరు, గ్రామానికి చెందిన పంటపొలాల ఎక్కువైన నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తుంది. అదే నీటిలో కొన్నేండ్ల నుండి పెద్ద గుంత ఏర్పడింది. ఎండ్లతరబడిగా ఉన్న పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికే ద్విచక్రవాహనదారులు, ఆటోలు గుంత గమనించక పలు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. జుక్కల్ ఎస్సై సత్యనారాయణ వివిధ పనులపైన అదే దారి గుండా వెళ్తున్న క్రమంలో పలుమార్లు గుంత ఉండటంతో సమస్య తలెత్తింది. గ్రామ సర్పంచ్ జల్దేవార్ దినేష్ యువకుడు కావడంతో గ్రామానికి చెందిన ఇంకొంతమంది యువకులకు మోటివేషన్ చేసిన ఎస్సై వారి సహకారంతో ప్రవహించే నీటిలోని పెద్ద గుంతను గుళక రాళ్లు, కంకర ఇతర సామగ్రితో పూడ్చి వేయించారు. ప్రస్తుతం సమస్య లేకుండా ప్రయాణికులకు కొంత ఉపశమనం లభించింది. ఈ విషయం అందరికీ తెలవడంతో ఎస్సై సత్యనారాయణను పలువురు ప్రశంసిస్తున్నారు.



పెద్దఎడ్గి హెల్త్ సబ్‌సెంటర్ పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్‌ను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం గురువారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి గుర్తింపు వారి వద్ద ఉన్న చెక్ లిస్ట్‌కు అనుగుణంగా తల్లిపిల్లల సేవలు, నవజాత శిశువు సంరక్షణ, యువ క్లినిక్ సేవలు, కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణ, సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు, ప్రథమ చికిత్స, రెఫరల్ సేవలు, జాతీయ కార్యక్రమాలపై ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ గుర్తింపు బృందం వైద్యుడు విజయ్‌కుమార్,

సయ్యద్ ఫరిదోద్దిన్, జిల్లా వైద్యాధికారీ డా.లక్ష్మణ్‌సింగ్, ఉపవైద్యాధికారి డా.శీరీష, డీపీవో పద్మజ, నాణ్యత జిల్లా మేనేజర్ జహేరా, వేణుగోపాల్, డీహెచ్ఈ దస్త్రీరాం, జుక్కల్ వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధుమలాంచ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

- ఏబీవీపీ విద్యార్థుల ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల కొరకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించి అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మించాలని కోరుతూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మొగలాజి మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిథిలావస్థ గదులలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం తక్షణమే స్థలం కేటాయించి అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చాలీచాలని గదులతో శిథిలావస్థమైన తరగతి గదిలో విద్యార్థులు చదువుకోవడం ఇబ్బందిగా మారిందని అన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో తహసిల్దార్ మమతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రవీణ్, థాన్‌సింగ్, ధన్‌సింగ్, నాగరాజు, రవీందర్, భరత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి బోధన్ నగర కార్యదర్శి మొగులాజీ, జోనల్ ఇంచార్జీ ప్రవీణ, అదుసింగ్, థానసింగ్, నాగరాజు, ధన్‌రాజ్, రవీంధర్, భారత్ విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

18న మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పదవిపై అవిశ్వాసం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవిపై అవిశ్వాస పరీక్ష ఈనెల 18న జరగనున్నట్లు అధికారికంగా తెలిసింది. మద్నూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా వాగ్మారే లక్ష్మీబాయి కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోవడం జుక్కల్ అసెంబ్లీకి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హనుమంతుషిండే సైతం ఓడిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. జుక్కల్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. గతంలో బిఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు అత్యధికంగా గెలవడం ఆ పార్టీ ఎంపీపీగా వాగ్మారే లక్ష్మీబాయి కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జుక్కల్‌లో ఎమ్మెల్యే మారడం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలవడం ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నుంచి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సమక్షంలో దాదాపు తొమ్మిది మంది ఎంపీటీసీలు చేరడంతో మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి అవిశ్వాసానికి దారితీసింది. ఎంపీటీసీ లంతా ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి ఆర్డిఓకు వినతిపత్రం సమర్పించగా.. అవిశ్వాస తీర్మానానికి ఈనెల 18న ఫిక్స్ అయినట్లు సమాచారం. అవిశ్వాసంలో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో మండల విద్యాధికారి సేవ్ల లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి గురువారం పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ జయంతి వేడుకలో భాగంగా ఎంపిడివో సతీష్ కుమార్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ మూడవ ఏట ప్రమాదవశాత్తు ఒక కన్నును కోల్పోయారని, తర్వాత కొన్ని రోజులకు రెండో కన్ను కూడా పాడయ్యిందని వివరించారు. ఫ్రాన్స్‌లో ఉన్న అందుల పాఠశాలకు తండ్రి సాయంతో అడ్మిషన్ పొందాడని, లూయిస్ ఆరు చుక్కల బ్రెయిలీని మార్చుతూ మూడు చుక్కలతో అందులు గల పిల్లలు బాగా చదువుతారని భావించి బ్రెయిలీని ప్రారంభించారు. అలా చదువుకుంటూ అదే పాఠశాలలో ప్రొఫెసర్ హెూదాను పొందారు. అంధులైన పిల్లలకు వెలుగు నింపిన, అంధులకు చీకటి నుంచి వెలుగును నింపిన ఘనుడు అని వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ టీచర్లు పెంటయ్య, సాయన్న, తపస్ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు రామారావు, రంజిత్, కవిత పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ఆర్డిఓ



బిక్షలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బోధన్ ఆర్డిఓ రాజాగౌడ్ అయ్యప్ప స్వాములకు తన వంతుగా భిక్ష కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో భక్తి మార్గాన్ని కలిగి ఉండాలని సూచించారు. అలాగే అయ్యప్ప స్వామి దీక్షపరులు ఎంతో కఠినంగా నియమాలను ఆచరించి కోరికలను త్యాగం చేస్తారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు కూడా భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం ఆయన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆర్డిఓ పరిపాలనాధికారి విఠల్ ఉన్నారు.

IN THE COURT OF THE III ADDL.DISTRICT JUDGE AT NIZAMABAD.
I.A.No. of 2023
in
O.S.No. 8 of 2017

Between:
Smt. Kaluva Vijaya ..**Petitioner**
and
Dr.G Madhusudan Reddy & others **Respondents**

To, Proposed party No.12 (Lr) Narasaiah S/o. Pedda Narasaiah aged Not Known, Occupation: Agriculture, R/o H.No.8-89/10, kammerpally (V) & (M), Nizamabad.

Where as the above named Petitioner filed the above I.A. under Order XXII Rule 2 R/w 151 of CPC against you.. The case is posted to 11-01-2024 for your appearance. You are hereby required to appear either in person or through an advocate before the said court on 11-01-2024 at 10.30 A.M failing which the matter will be decided in your absence.

//BY THE ORDER OF COURT//
K. GANESH
ADVOCATE, NIZAMABAD.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఓ

నవతెలంగాణ-సదాశివనగర్



స్టాక్ బోర్డును ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి అన్నారు. మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో విత్తనాలు, పురుగు మందు ల దుకాణాలు గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాదారులు స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ అప్ టు డేట్ ఉండాలని తెలిపారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని అన్నారు. ప్రింట్ ధర కన్న ఎక్కువగా అమ్మకూడదని తెలిపారు. అనంతపురం రిజిస్టర్లను తనిఖీ చేసినట్లు తెలిపారు.

పీఆర్‌టియు టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భీంగల్



పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పి ఆర్‌టియుటిఎస్ 2024 నూతన క్యాలెండర్‌ను మండల విద్యాధికారి స్వామి, మండల అ ధ్య క్షు లు యం.వాసుదేవ్, ప్రధాన కార్యదర్శి రాస దయాకర్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాద్యులు కాశీరాం, వి.లక్ష్మీ నారాయణ, దేవరాజ్, మండల భాద్యులు శేఖర్, శ్రీనివాస్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వేముల



పెళ్లిలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్‌లో జరిగిన ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి కుమార్తె వివాహ వేడుకకు బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.

యూనివర్సిటీలో యువజన క్రీడోత్సవాలు



క్రీడలను ప్రారంభించిన రిజిస్ట్రార్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్వామీవివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకొని తెలంగాణ యూనివర్సిటీలో యువజన క్రీడోత్సవాలను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు యువకులకు మానసికంగా, శారీరకంగానూ ఉపయోగ పడతాయని అన్నారు. ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువత దేశానికి అవసరమని స్వామి వివేకానంద చెప్పిన సూక్తిని ఆదర్శంగా తీసుకొని యువకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజ్, నాయకులు సాయి కుమార్, అమృత్ చారి, ప్రమోద్, సింహాద్రి ,నరసింహ తదితరులు పాల్గొన్నారు

6న ప్రజా పాలనలో పాల్గొననున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- ప్రజలు నాయకులు అధికారులు సకాలంలో హాజరుకావాలి
- ఆర్మూర్ చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

ఈనెల 6న శనివారం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలనుండి స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించే గ్రామా సభ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి పాల్గొన్నానున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల అమలుకు గ్రామా గ్రామాన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించే దిశగా చేపడుతున్న కార్యక్రమం విజయవంతం చేసేందుకు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని అయన కోరారు. అనంతరం మండలకేంద్రములోని గురడి కాపు సంఘంలో మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నారని తెలిపారు.

పాల్దలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం పాల్ద గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర హెల్త్ డిపార్ట్మెంట్, డిప్యూటీ సెక్రటరీ కమల్ అరోర, ఆదిత్య లోహియా కేంద్ర బృందం హాజరయ్యారు అన్ని డిపార్ట్మెంట్ల నుండి ప్రతినిధులు పాల్గొని డిపార్ట్మెంట్ వారిగా ప్రజలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు జనవరి 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను అంతర్జాలంలోని వెబ్‌సైట్ navodaya.gov.inలో డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. హాల్‌టికెట్ డౌన్లోడ్‌లో ఏదైనా సమస్య ఉంటే నవోదయ విద్యాలయానికి వచ్చి తీసుకోవాలని అమె సూచించారు. మొత్తం 5252 దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు.

రామ భక్తుల పాదయాత్ర

నవతెలంగాణ-పిట్లం



మండలంలోని తిమ్మానగర్ గ్రామప్రజలు వీర హనుమాన్ మందిరం నుంచి వినాయక మందిరం వరకు రామభక్తులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. అయోధ్యలో నూతనంగా రామ మందిరం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున హిందూ వాహిని పిలుపు మేరకు గ్రామంలో రామభజన నిర్వహించి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో గ్రామప్రజలు, హిందూవాహిని సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించిన కలెక్టర్

- పడకల్, అర్గుల్ గ్రామాలు సందర్శన



జక్రాన్‌పల్లి : మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నవీపేట్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్



కమ్మర్‌పల్లి : దరఖాస్తు స్వీకరణను పరిశీలిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-విలేకరులు

జక్రాన్‌పల్లి:మండలంలోని పడకల్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలోని దరఖాస్తులను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తనిఖీచేసి పలు సూచనలను, సలహాలను ఇచ్చారు. దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలను చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కలీం, ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం, అర్గుల్ సర్పంచ్ గోర్తే పద్మా రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిఅధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

కమ్మర్‌పల్లి:మండలంలోని బషీరాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సర్పంచ్ సక్కరం అశోక్ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్ సందర్శించారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన ప్రారంభం నుండి ఇప్పటివరకు సుమారు 11వందల ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, నాయకులు సుమన్, నారాయణ, మురళి, నేల్లా రమేష్, ఆర్బీ రాజు, అంగన్వాడీ టీచర్లు, సీఏ లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్:మండలంలోని బినోల గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభను సర్పంచ్ పితాంబర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ ధన్వాల్ దరఖాస్తులను స్వీకరించారు. అభయ హస్తం దరఖాస్తులను తప్పులు లేకుండా స్వీకరించి రసీదు ఇవ్వాలని స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఫైల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుట్టి పోశెట్టి, పి ఆర్ ఏ ఈ శ్రావణ్ కుమార్, ఏపియం భూమేశ్వర్ గౌడ్, ఆర్ డబ్ల్యూఎస్ఈ రాము, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

ప్రతి పేదోడికి పథకాలు అందేలా కృషి చేస్తా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్
- ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటి నెరవేరుస్తాం
- ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారం బయట అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ప్రతి పేదోడికి పథకాలు అందేలా ఆరు గ్యారంటీల పథకాలు అమలు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట్ గ్రామంలో ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రతి పేదవాడికి అందేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికలకంటే ముందు నాగిరెడ్డిపేట్ మండలంతోపాటు ఎల్లారెడ్డి నియోజకవర్గం అంతా తానే స్వయంగా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రతి పేదవాడికి మూడు పూటలా తిండి ఉండటానికి ఇల్లు తాగడానికి నీరు ఉండే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. పేదవాడికి అన్యాయం జరిగితే అక్కడ మదన్మోహన్ ఉంటాడని పేదవాడికి న్యాయం జరిగే విధంగా తానే చూస్తానని ఆయన అన్నారు. గ్రామాల్లో రేషన్ కార్డు సమస్య తీవ్రంగా ఉందని గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక రేషన్ కార్డు ఇవ్వలేకపోయిందని తెలిపారు. ఇప్పుడు అర్హులందరికీ రేషన్ కార్డు అందిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైందని దొరల పాలన ముగిసిందని ఆయన అన్నారు. 15 రోజులకు ఒకసారి మండల కేంద్రానికి రావడం జరుగుతుందని ప్రజల సమస్యలు ఖచ్చితంగా తీరుస్తానని ఆయన తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

ప్రజా పాలనలో దరఖాస్తులకు సంబంధించి అధికారులు ఎవరైనా లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. 30 సంవత్సరాలుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం వెనుకబడిందని తెలంగాణ రాష్ట్రంలోనే ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తానని ఆయన అన్నారు. తెలివిలేని కొందరు బిజెపి నాయకులు ఆరు గ్యారెంటీల గురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వాళ్లకు పని చేతకాక ఇతరులపై అభియోగాలు మోపుతున్నారన్నారు. పోచారం ప్రాజెక్టును టూరిజంగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలో మాల్ తుమ్మెద శివారులో గల 834. 835 సర్వే నెంబర్లలో గల భూ సమస్యలను త్వరితగతిన తీర్చేసామన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట సర్పంచ్ కిచ్చయ్య గారి సునీత రెడ్డి, ఎంపిటిసి మాధవి, ఎంపీపీ రాజుదాస్, జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, స్పెషల్ అధికారి రఘునాథ్, తహసీల్దార్ మహేందర్ కుమార్, ఎంపీఓ శ్రీనివాస్ ఏవో విజయ శేఖర్, తదితరులు ఉన్నారు.

9 వరకే అలీసాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నవీపేట్

ఈ నెల 9 వరకు అలీసాగర్ నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలీ సాగర్ ప్రాజెక్టు నుండి మొదటి విడతగా సాగునీటి కోసం ఈ నెల 9న సాయంత్రం నీటి విడుదలను నిలిపివేసి రెండో విడత ఈనెల 17వ తేదీ ఉదయం ప్రారంభించబడుతుందని తెలిపారు. కాబట్టి రైతులు గమనించి వరిసాగు చేసుకోవాలని సూచించారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన టెన్నికాయిట్ క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 9 నుండి 13 వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే సీనియర్ మహిళాలా టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు నిజామాబాద్ క్రీడాకారిణిలు త్రిష, ప్రసజ్ఞ, నవనీత, ఉమారాణి ఎంపికయ్యారని జిల్లా సంఘం ప్రతినిధులు మల్లేష్ గౌడ్, భూపతి గురువారం తెలిపారు. వీరు మన తెలంగాణ మహిళల సింగిల్స్ జట్టుకు ఎంపిక కావడం విశేషం. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్, పిఆర్‌టియు రాష్ట్ర పత్రిక సంపాదక వర్గ సభ్యులు పెంట జలంధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ లక్ష్మి నర్సయ్య, సీనియర్ ఉపాధ్యాయులు గంగ నరసయ్య, భూమేశ్వర్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్ అర్జున్ సెక్రెటరీ మల్లయ్య తదితరులు పాల్గొని అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ కామారెడ్డి

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించరు. ఇందులో భాగంగా కళాబృందం సభ్యులు, సైబర్ సెల్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సైబర్ నేరాల పట్ల భాదితులు టోల్ ఫ్రీ నెంబర్ 1930 అనే నెంబర్ కి ఫిర్యాదులు చేసుకోవచ్చు అన్నారు. సైబర్ నేరగాళ్ల చేసే పెట్టుబడి మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, ఆన్లైన్ లావాదేవీలు మోసాలు, మోసపూరిత ఫోన్ కాల్స్ సందేహాలను నమ్మవద్దని, లోన్ అప్లికేషన్ ఎవరు డౌన్లోడ్ చేసుకోవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు గానీ, బహుమతులుగాని, ఉద్యోగాలు గాని ఎవ్వరు ఇవ్వరనే విషయాన్ని అర్థం చేసుకొని మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని తెలియపరుస్తున్నాం అన్నారు. కార్యక్రమంలోదేవునిపల్లి పిఎస్ సిబ్బంది, కళాబృందం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- న్యాయం కోసం పోలీసుల చుట్టూ తిరుగుతున్న
- కేసు పెట్టినా.. విదేశాలకు పంపించారు
- బాధితురాలు నజీమ్ సుల్తానా



మీడియాతో మాట్లాడుతున్న నజీమ్ సుల్తానా

నవతెలంగాణ-కామారెడ్డి

తన అత్తమామల వల్ల తనకు అన్యాయం జరుగుతుందని తనకు న్యాయం చేయాలని కామారెడ్డి పట్టణానికి చెందిన నజీమ్ సుల్తానా అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోగల సఖి కేంద్రానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను పోలీసుల చుట్టూ, సఖి సెంటర్ చుట్టూ తిరిగిన తనకు న్యాయం జరగడంలేదని, తన భర్తపై తాను కేసు పెట్టిన పోలీసులు ఆయనను విదేశాలకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డికి చెందిన తనకు ఆరు సంవత్సరాల క్రితం గాంధారి మండలం మొండి సడక్ కు చెందిన ఎండి ఇమ్రాన్తో వివాహం జరిగిందని, తమకు రెండు సంవత్సరాల కొడుకు ఉన్నాడు అన్నారు. తన భర్త 15 సంవత్సరాలుగా దుబాయ్ వెళుతూ వస్తున్నాడని, తనను 12 లక్షల వరకట్నం తెమ్మని అత్తమామలు వేధిస్తున్నారని, నీవు 12 లక్షలు ఇవ్వకపోతే మరో పెళ్లి చేస్తామని అత్తమామలు ఇబ్బంది పెడుతూ మరొకరితో సంబంధం కయం చేసుకున్నారన్నారు. మారో సంబంధం ఖాయం చేసుకున్న ఫోటోలను ఆమె మీడియాకు చూపెట్టారు. తాను చేసేదేమీ లేక కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, 498 సెక్షన్ కింద నా భర్త పై కేసు నమోదు చేశారని గత ఆరు నెలల క్రితం నా భర్త ఇమ్రాన్ ఇండియాకు వచ్చిన సమయంలో మాట్లాడిస్తామని చెప్పి ఏమి మాట్లాడకుండానే తన భర్తను దుబాయ్‌కి తిరిగి పంపించారని, ఆ సమయంలోనే మరో వ్యక్తితో నిశ్చితార్థం చేశారని వాపోయింది. ఆమెతో ఎప్పుడైనా పెళ్లి చేయవచ్చునని అందుకే తనకు న్యాయం చేయాలని కోరుతున్నానని అన్నారు. సీఐ నరేష్ 50వేల వరకు తీసుకొని దుబాయ్ పంపించాడని ఆమె ఆరోపిస్తున్నారు. తాను కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎప్పుడు వెళ్లిన సీఐ పోలీస్ స్టేషన్లో ఉండడం లేదన్నారు. సఖి సెంటర్‌కు వెళ్తే భార్యాభర్త ఉంటేనే కౌన్సెలింగ్ చేస్తామని భర్త లేకుండా ఒకరికి ఎలా కౌన్సెలింగ్ చేస్తామని అంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్‌కు చెందిన హాజి అనే వ్యక్తి పెళ్లిళ్లు, విడాకులు చేస్తాడని ఆయన తన అత్తమామ దగ్గర డబ్బులు తీసుకొని తనకు అన్యాయం చేయాలని చూస్తున్నాడని అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఉద్యోగ విరమణ అపురూప ఘట్టం

- ప్రిన్సిపాల్ సంగీత
- అధ్యాపకునికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పదవీ విరమణ ఒక అపురూప ఘట్టమని, ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలం లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో గంగవరపు ఆంజనేయశర్మ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న గంగవరపు ఆంజనేయశర్మ డిసెంబర్ 31న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. 34 ఏళ్ల పాటు సేవలు అందించి విద్యార్థుల ప్రగతికి తోడ్పడి, విద్యార్థులకు అకడెమిక్ పాఠాలే కాకుండా జీవిత పాఠాలు కూడా నేర్పించారని కొనియాడారు. ఆంజనేయశర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా చేరినప్పటి నుండి జీవితం ఎంతో సంతృప్తి ఇచ్చిందని, ఉపాధ్యాయ జీవితం ఎంతో ఆదర్శప్రాయమైనదని తెలిపారు. జీవితంలో విద్యార్థి దశ అనేది చాలా ముఖ్యమైనదని, విద్యార్థి గా ఉన్నప్పుడే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఈ కార్యకరమానికి ముఖ్య అతిథిగా సాంఘిక సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వధికారిని అలివేలు మాట్లాడుతూ గంగవరపు ఆంజనేయశర్మ సేవలను గుర్తు చేస్తూ, వారి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ మాజీ ఆర్సీఓ సింధు, ఉప్పల్వాయి ప్రిన్సిపల్ సత్యనారాయణ, కంజర ప్రిన్సిపల్ మాధవీలత, దోమకొండ ప్రిన్సిపల్ శివరాం, ధర్మారం పాఠశాల, కళాశాల సీనియర్ వైస్ ప్రిన్సిపల్ డి.కిషన్, సుపెరింటెండెంట్ కె.రాజేందర్ రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు ఆంజనేయ శర్మ బంధు మిత్రులు పాల్గొని పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



గంగవరపు ఆంజనేయశర్మ దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత, బంధుమిత్రులు